క్లుప్తంగా

3వ రోజు నిరసన


నిరసన తెలుపుతున్న బాధితులు

దొర్నిపాడు: వెల్త్ అండ్ హెల్త్ ఫైనాన్షియల్ సొల్యుషన్స్ బాధితుల నిరసన గురువారం మూడో రోజుకు చేరింది. స్థానిక ప్రధాన రహదారిపై బాధిత మహిళలు, పురుషులు కూర్చొని తమకు న్యాయం చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. బాధితుడు తేజ మాట్లాడుతూ ఒక్కొక్కరి నుంచి రూ.3.50 లక్షలు దండుకుని ఉద్యోగాలు చూపకుండా బోర్డు తిప్పేసిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తమకు ఉద్యోగాలు వద్దని, డబ్బు తిరిగి ఇవ్వాలన్నారు. ఇళ్లు, బంగారు నగలు తాకట్టు పెట్టి నగదు తెచ్చామన్నారు. ప్రభుత్వం వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుని మోసపోయిన తమకు న్యాయం చేయాలని కోరారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక


ప్రతిజ్ఞ చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య అధ్యక్షతన రుద్రవరం మండలం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా హరిశంకర్, ప్రధాన కార్యదర్శిగా విజయరమేష్, ఉపాధ్యక్షులుగా శేఖర్, సర్దార్ పటేల్, నాగేశ్వరమ్మ, నారాయణరెడ్డి, రమేష్ బాబులతో పాటు కార్యదర్శులుగా భాస్కర రెడ్డి, శ్రీరంగాపురం రమేష్‌బాబు, బురారుద్దీన్, కోటకొండ నాగేంద్ర, గంగన్న, సుబ్బమ్మలు ఎన్నిక కాగా కౌన్సిల్ సభ్యులుగా పాములేటి, రమేష్‌బాబు, మధు, నారాయణను ఎన్నుకున్నారు. కార్యవర్గ ఎన్నిక అధికారులుగా రమేష్‌బాబు, రాంచంద్రారెడ్డి, జాకీర్ హుసేన్ వ్యవహరించగా, ఈ కమిటీ 2025 నుంచి 2027 వరకు కొనసాగనుంది.

నేటి నుంచి శివరామస్వామి ఆరాధనోత్సవాలు


అవధూత శివరామస్వామి

నంద్యాల(అర్బన్): మండలం మిట్నాల గ్రామంలో వెలసిన అవధూత శివరామ స్వామి ఆరాధనోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయని పురోహితులు గడియారం ప్రభాకర్ శర్మ గురువారం తెలిపారు. మిట్నాల, జిల్లెల్ల గ్రామస్తుల సహకారంతో ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు రుద్రాభిషేకాలు, పుష్పాభిషేకాలతో పాటు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. అత్యంత వైభవంగా జరిగే ఈ ఆరాధన మహోత్సవాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఆహారాన్ని వృథా చేయొద్దు


ఆహార పదార్థాలు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించే ప్రయత్నం చేయాలని, ఎక్కడా కూడా వృథా చేయరాదని ఆత్మకూరు చారిటబుల్ ట్రస్టు అధినేత సుదర్శనం శెట్టి అన్నారు. గురువారం ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక హెచ్ఐవీ బాలల లైఫ్ పరివర్తన కేంద్రంలో చిన్నారులకు నెల రోజులకు సరిపడ ఆహార పదార్థాల సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా సుదర్శనం శెట్టి మాట్లాడుతూ ఆహారం వృథా చేయరాదనే భావన ప్రతి ఒక్కరిలో రావాలని, ప్రజలకు సరిపడ ఆహార ఉత్పత్తి కోసం స్వయం సమృద్ధి సాధించే దశకు ప్రపంచమంతా చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, లయన్స్‌క్లబ్ సభ్యులు నాగరాజు, సహదేవుడు, జనార్దన్, రవి, వాసు, అబ్రహం లింకన్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో మోస్తరు వర్షం

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణం, మండలంలో గురువారం ఓ మోస్తరు వర్షం కురిసింది. రోడ్లు, కాలువలు జలమయమయ్యాయి. వర్షం రాకతో మొక్కజొన్న రైతులు ఆందోళన చెందారు. పంట చేతికొచ్చే సమయంలో వర్షం రావడంతో మొక్కజొన్న కంకి దెబ్బతింటుందని, వరుణుడు శాంతిస్తే మొక్కజొన్న పంట దిగుబడి బాగుంటుందని రైతులు ఆశిస్తున్నారు.

మోదీజీ.. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపండి



కర్నూలులో మోదీ సభ వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నంద్యాల(అర్బన్): మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరిస్తే పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి వైఎస్సార్‌సీపీ నాయకులు ప్లకార్డుల ద్వారా విన్నవించారు. కర్నూలులో గురువారం కూటమి ప్రభుత్వం నిర్వహించిన బహిరంగ సభ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు సాయిరాంరెడ్డి, నరసింహ, సాయి, గిరీష్, శివలు ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతపురంలోని ఆర్‌డీటీకి ఫారిన్ నిధుల విడుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కల్తీ మద్యం స్కాంను సీబీఐకి అప్పగించి నిందితులను కఠినంగా శిక్షించి పేద ప్రజల ప్రాణాలు కాపాడాలన్నారు.

వక్కిలేరులో వజ్రాన్వేషణ


వక్కిలేరు వాగు వెంట వజ్రాన్వేషణకు వచ్చిన జనం

- జాతరను తలపిస్తున్న వక్కిలేరు వాగు
- వాహనాల్లో చేరకుని వజ్రాల అన్వేషణ

శిరివెళ్ల: ఒక వజ్రమైనా దొరకదా.. కష్టాలు తీరవా.. అనుకుంటూ నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీ సర్వ నరసింహ స్వామి ఆలయ పరిసరాలలో వక్కిలేరు వాగు వెంబడి జనం వజ్రాన్వేషణ చేస్తున్నారు. ఏటా ఈ ప్రాంతంలో వర్షాలు కురిస్తే ప్రజలు వజ్రాల కోసం ఇక్కడికి వస్తారు. కర్నూలు నుంచే కాకుండా ప్రకాశం, గుంటూరు, వైఎస్సార్ జిల్లాల నుంచి ప్రజలు వస్తున్నారు. పిల్లా పాపలు, యువకులు, యువతులు, వృద్ధులతో ప్రాంతం జాతరను తలపిస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం దాకా వజ్రాల కోసం అన్వేషిస్తారు. రాత్రికి స్థానికులు ఇళ్లకు చేరకోగా దూర ప్రాంతం వారు తెలుగు గంగ వద్ద ఉన్న ఆంజనేయ స్వామి గుడి ఆవరణలో బసచేస్తారు. తెల్లవారగానే మళ్లీ వాగు వద్దకు చేరుకుని అన్వేషణ మొదలు పెడతారు. అలా వారం రోజులు వరకు ఇక్కడే ఉంటున్నారు. ఎంతో నీటి రాళ్లను జల్లెడలతో అన్వేషణ చేస్తున్నారు. ఎక్కువగా తెల్లని చెకుముకి రాళ్లు దొరుకుతున్నాయని కొందరు చెబుతున్నారు.

టెట్‌లో మినహాయింపు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ఏవీ గోపాల కృష్ణ

చాగలమర్రి: సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.మౌలాలి, రాష్ట్ర కార్యదర్శి ఏవి గోపాల కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఆర్థిక కార్యదర్శి మహబూబ్ హుసేన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. విద్యా బోధనలో ఎంతో అనుభవం ఉన్న ఉపాధ్యాయులు అర్హత పరీక్ష రాయాలనడం సరికాదన్నారు. ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.శివశంకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లకు రావలసినటువంటి ఆర్థిక బకాయిలను చెల్లించడంలో ప్రభుత్వం అలసత్వం తగదన్నారు. వెంటనే ప్రభుత్వం రూ. 31 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై బోధనేతర పనుల ఒత్తిడి పెరుగుతుందని, ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షుడు నరసింహారావు, జిల్లా ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ గుప్తా, సీనియర్ నాయకులు శేషాద్రి, కృష్ణ శాస్త్రి, జయరాజు, రమేష్‌బాబు, గురుచంద్రుడు, మహబూబ్‌బాషా, గౌస్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన సాగు


ఎరువు వేస్తున్న దృశ్యం

దొర్నిపాడు: పప్పుశనగ సాగును రైతులు మాత్ర పంటగా భావిస్తారు. మండలంలో మెట్ట పంటల్లో భాగంగా అధికంగా ఏటా శనగను విస్తారంగా సాగు చేస్తారు. అయితే సాగుకు నెలరోజుల ముందు పొలాల్లో రసాయన ఎరువులను విత్తుతారు. కానీ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సాగు ఆలస్యం అవుతోంది. ఏటా ఈ సమయానికి విత్తన పనులు ఊపందుకునేవి. ప్రస్తుతం భారీ వర్షాలతో పొలాల్లో తడి ఇంకా అలాగే ఉండటంతో సేద్యం పనులు జరగకపోవడంతో బీళ్లుగా మారాయి. గత రెండు రెండు రోజుల నుంచి కాస్త విరామం ఇవ్వడంతో రైతులు రసాయన ఎరువులు విత్తే పనుల్లో నిమగ్నం అయ్యారు. మండలంలోని క్రిష్టిపాడు, దొర్నిపాడు, గుండుపాపల, చాకరాజువేముల, డబ్ల్యూ కొత్తపల్లె, డబ్ల్యూ గోవిందిన్నె గ్రామాల్లో శనగ పంటను 4 వేల హెక్టార్లలో సాగు చేస్తారు.

సత్కారం


డాక్టర్ రవికృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

గోస్పాడు: ప్రపంచ అనస్థీషియా దినోత్సవం పురస్కరించుకుని కళారాధన కార్యాలయంలో నంద్యాల మొట్టమొదటి అనస్థీషియా వైద్య నిపుణులు డాక్టర్ రవికృష్ణను జిల్లా భాషోపాధ్యాయుల సంస్థ అధ్యక్ష కార్యదర్శులు కన్నయ్య, హుసేన్ మియా ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అవ్వారి శేష ఫణి, ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి అన్నెం శ్రీనివాసరెడ్డి, భాషోపాధ్యాయుల సంస్థ జిల్లా అధ్యక్షులు కన్నయ్య, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ 1992లో నంద్యాలకు మొట్టమొదటి అనస్థీషియా వైద్య నిపుణులుగా వచ్చిన డాక్టర్ రవికృష్ణ గత 33 సంవత్సరాలుగా విశిష్ట వైద్య సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో దామోదర్, విశ్వనాథరెడ్డి, సుధాకర్ గౌడ్, లింగమయ్య ముస్తఫా, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎంపీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

నంద్యాల(న్యూటౌన్): వచ్చే నెల 17, 18 తేదీల్లో బేతంచెర్లలో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏసురత్నం అధ్యక్షతన జిల్లా మహాసభల జయప్రదానికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్పు చేస్తూ పని గంటలు పెంచుతూ కార్మిక వర్గాని తీవ్రంగా మోసం చేసిందన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎల్ఐసీ, బ్యాంకు, రైల్వే, పోర్టులు, కేంద్ర గిడ్డంగి సంస్థలు, ప్రైవేటుకు అప్పజెబుతూ ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేశారన్నారు. ఏళ్ల తరబడి కేంద్ర ప్రభుత్వ స్కీంలో పని చేస్తున్న అంగన్‌వాడీ, ఆశా, ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, వైద్య రంగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కనీస వేతనాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించడంలో విఫలమైందన్నారు. రాష్ట్రంలోని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి నేతలు విస్మరిస్తున్నారన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు తోటమద్దులు, గౌస్, లక్ష్మణ్, బాలవెంకట్, వెంకటలింగం, ఎల్లయ్య, రాంనాయక్, శివరాం, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భజన



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై అనంతపురానికి చెందిన చెన్నారెడ్డి, బృందం వారిచే భజన కార్యక్రమం నిర్వహించారు. గణేశప్రార్థన, శివ శివ శంకరా, అరుణాచలశివ, లింగాష్టకం, శ్రీశైలం శివమయం, పార్వతీరమణ, మహేశాగౌరీశా, నల్లమల కొండలలో మొదలైన భక్తిగీతాలను, భజన కీర్తనలను చెన్నారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, పుల్లారెడ్డి, నాగేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి, జనార్ధనరెడ్డి, శంకర రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి తదితరులు ఆలపించారు.

వామపక్ష నాయకుల అక్రమ అరెస్ట్ తగదు


మాట్లాడుతున్న నాగరాజు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర అభివృద్ధిని మరిచి అప్పుల ఊబిలో కూరుకొని పోయేలా చేసిన మోదీ పర్యటనపై విమర్శలు చేసిన వామపక్ష పార్టీల నాయకులను అక్రమ అరెస్టులు చేయడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగరాజు, పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ అన్నారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు మోదీ అమరావతికి నీళ్లు, మట్టి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. రూ.11వేల కోట్లు ఇస్తామని చెప్పి అప్పు రూపంలో ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్రానికి నిధులు ఇవ్వాలని, విభజన హామీలను నెరవేర్చాలని చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో అక్రమ అరెస్టులు చేయడం కేంద్ర ప్రభుత్వ అసమర్థతతే అన్నారు. రాష్ట్రానికి నిధులు కేటాయించాలని, విభజన హామీలను అమలు చేయాలని ప్రధాని మోడీ స్పష్టమైన వైఖరి తెలుసుకోవాలని అడిగేందుకు వెళితే అనుమానంతో పోలీసులు పార్టీ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు.

ముగ్గురూ.. ఒకే హెలికాప్టర్‌లో

- హెలిప్యాడ్ల నిర్మాణ వ్యయం వృథా
- మోదీ రోడ్డుషో లేకపోవడంతో ప్రజలు నిరాశ


కారులో నుంచే ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ

శ్రీశైలంటెంపుల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం శ్రీశైలం పర్యటనలో కొన్ని అనుకోని ఘటనలు చోటుచేసుకున్నాయి. 20 రోజుల క్రితం ప్రధాని శ్రీశైలం పర్యటన ఖరారైంది. ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టిసారించింది. జిల్లా ఉన్నతాధికారులు శ్రీశైలంలోనే తిష్టవేసి ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఏర్పాట్లలో భాగంగా రాష్ట్ర గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం, ప్రధాని వేర్వేరు హెలికాప్టర్లలో వస్తారని నిర్ణయించుకుని అందుకు అనుగుణంగా సున్నిపెంటలోని ఎకోలాజికల్ పార్క్‌లో మూడు హెలిప్యాడ్‌లను సిద్ధం చేశారు. అక్కడ ఒక హెలిప్యాడ్ ఉంది. మరో రెండు హెలిప్యాడ్‌లను నూతనంగా సిద్ధం చేశారు. ప్రాజెక్టు ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో నూతనంగా మరో మూడు హెలిప్యాడ్‌లను సిద్ధం చేశారు. హెలిప్యాడ్‌లతో పాటు అక్కడ విద్యుత్‌లైట్లు, జంగిల్ క్లియరెన్స్, గ్రౌండ్ చదును తదితర పనులకు రూ.కోట్లలో ఖర్చు అయినట్లు సమాచారం. అయితే గవర్నర్ రాకపోగా, సీఎం, డిప్యూటీ సీఎంలు ప్రధాని హెలికాప్టర్‌లోనే రావడంతో మూడు హెలిప్యాడ్‌లకు చేసిన ఖర్చు వృథా అయింది. అలాగే శ్రీశైల ఆలయంలో శ్రీశైల జగద్గురు పీఠ సింహాసనం ఉంది. అక్కడ శ్రీశైల జగద్గురు పీఠాధిపతి పండితారాధ్య శివాచార్య మహాస్వామి ఉన్నారు. ప్రధాని పర్యటన తెలుసుకుని మూడు రోజుల ముందుగానే పీఠాధిపతి పీఠానికి చేరుకున్నారు. ప్రధాని ఆలయ సందర్శనకు వచ్చినప్పుడు పీఠాన్ని సందర్శిస్తారని పీఠాధిపతి ఆశించారు. కానీ ప్రధాని పీఠాన్ని సందర్శించకపోవడంతో పీఠాధిపతి విస్మయానికి గురయ్యారు. ప్రధాని నంది మండపం నుంచి గంగాధర మండపం వరకు కారుపై నుంచి రోడ్డుషో ద్వారా ప్రజలకు అభివాదం చేసుకుంటూ వెళ్తారని భావించిన ప్రజాప్రతినిధులు తదనుగుణంగా నియోజకవర్గం నుంచి ప్రజలను తరలించారు. సుమారు 5వేలకు పైగా జనాలను తరలించారు. పైగా మహిళలకు కాషాయ రంగు చీరలు సైతం ఉచితంగా అందించినట్లు సమాచారం. పురుషులు తెల్ల పంచె, చొక్కా వేసుకుని రావాలని, వారి ఆధార్‌కార్డులను సైతం తీసుకుని పాసులిచ్చారు. అయితే ప్రధాని కారు నుంచి బయటికి రాకుండా, కారులోనే ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకు వెళ్లడంతో ప్రజలు నిరాశ చెందారు.

ప్రధాని మోదీ నోట మహానంది మాట

మహానంది: 'మహానంది కే శ్రీ మహానందీశ్వర స్వామికో ప్రణామ్ కర్తాహు' అంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రస్తావించడం ఆలయ విశిష్టత, చరిత్ర ఎంతటి గొప్పదో తెలుస్తుందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కర్నూలులో గురువారం జరిగిన జీఎస్టీ సభలో ఆయన మాట్లాడుతూ మహానంది, అహోబిలం, మంత్రాలయం ఆలయాల్లో కొలువైన శ్రీ అహోబిల నరసింహస్వామి, శ్రీ రాఘవేంద్ర స్వామిలకు నమస్కరించడం పట్ల ఆయా ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పాణ్యంలో పట్టపగలే చోరీ


దొంగలు పగులగొట్టిన బీరువా

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని హెచ్‌పీ గ్యాస్ ఆఫీస్ వద్దనున్న ఓ ఇంట్లో దొంగలు పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. రచ్చకట్ట వీధికి చెందిన యామసాని అనసూయమ్మ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తగా పనిచేస్తున్నారు. గురువారం ఉదయం ఎప్పటిలాగే విధులకు వెళ్లారు. కుటుంబ సభ్యులు పనినిమిత్తం నంద్యాలకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి బీరువా పగులగొట్టి అందులోని 3.5 తులాల బంగారం చోరీ చేశారు. ఇంటికి వచ్చి గమనించిన బాధితురాలు చోరీ విషయం గుర్తించి పాణ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీమ్ చోరీ జరిగిన ఇంటికి వచ్చి వేలిముద్రలు, వివరాలు సేకరించింది. సేకరించిన నమూనాలను ల్యాబ్‌కు పంపుతున్నట్లు క్లూస్ టీమ్ సిబ్బంది తెలిపారు. అయితే జనసంచారం ఉండే ప్రధాన వీధిలోనే పట్టపగలు చోరీ జరగడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

పేద బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి


రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ సంఘం చైర్మన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పేద బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ చైర్మన్ బుచ్చిరాంప్రసాద్ అన్నారు. బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశాన్ని గురువారం స్థానిక ప్రథమ నంది ఆలయంలోని గాయత్రి అమ్మ వారి దేవస్థానంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బ్రాహ్మణ సంక్షేమ సంస్థ చైర్మన్ బుచ్చిరాంప్రసాద్ హాజరై మాట్లాడుతూ పేద బ్రాహ్మణుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. అదే విధంగా సంఘం బలోపేతానికి సూచనలు, సలహాలను, సందేహాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నగరడోన సుధీర్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు హయగ్రీవాచార్యులు, దత్తాత్రేయశర్మ, రామరాజు, మురళీ, ప్రభాకర్ శర్మ, శాంతి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం గ్రామానికి చెందిన బోడెద్దుల అంజి, మరికొందరు బస్సులో మోదీ సభకు శ్రీశైలం వెళ్లారు. తిరుగుప్రయాణంలో భాగంగా ఆర్టీసీ బస్సు శిఖరం సమీపంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద ఎగిరేయడంతో వెనుక కూర్చున్న అంజి తలకు, వెన్నెముక ప్రాంతంలో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి

డోన్ టౌన్: మద్యం మత్తులో వ్యక్తిపై కొందరు దాడి చేసిన ఘటన డోన్‌లోని కొట్రికె జిన్నులో గురువారం చోటుచేసుకుంది. బాధితుడి వివరాల మేరకు.. పట్టణంలోని కొట్రికె జిన్నులో ఉన్న రఫీ రైస్ మిల్లులో రంగవలి హమాలీగా పనిచేస్తున్నాడు. ఈ రైస్ మిల్లు సమీపంలో ఆర్ఎంపీ వైద్యుడు బాలు మరికొందు ప్రతి రోజు మద్యం సేవిస్తుంటారు. గురువారం మద్యం సేవించి ఖాళీ మద్యం బాటిళ్లను పడవేయడంతో రంగవలి, బాలు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఉన్న బాలు, మరికొందరు రంగవలిపై కర్రతో తలపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన తోటి హమాలీలు క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సాయంత్రం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడు బాలు రైస్ మిల్లు సమీపంలోని పాత సంచుల గోడౌన్ యజమాని గౌడ్‌పై కూడా దుర్భాషలాడి దాడికి ప్రయత్నించినట్లు తెలిసింది. ఈ విషయంపై గౌడ్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసలు విచారణ చేస్తున్నారు.

ఉపాధ్యాయుల బదిలీల సమస్యను పరిష్కరించాలి


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయుల బదిలీల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షుడు కన్నయ్య, ప్రధాన కార్యదర్శి హుసేన్‌మియా అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో విద్యారంగ సమస్యలపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో డీఎస్సీ 2025 ఉపాధ్యాయులు వచ్చినప్పటికీ జూన్ నెలలో బదిలీ అయిన హిందీ భాషోపాధ్యాయులు ఇంకా రిలీవర్, బదిలీ కాలేదన్నారు. జిల్లాలో వంద మంది ఉపాధ్యాయులు బదిలీ అయి కొత్త పాఠశాలలో జీతాలు తీసుకుంటున్నా పాత పాఠశాలలోనే పని చేస్తున్నారన్నారు. హిందీ భాషోపాధ్యాయులు అధిక శాతం ఉన్నారన్నారు. రిలీవర్లతో సంబంధం లేకుండా వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. పదోన్నతుల కోసం కృషి చేసిన కన్నయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అన్నెం శ్రీనివాసరెడ్డి, శేషఫణి, లింగమయ్య, విశ్వనాథరెడ్డి, దామోదర్, రఫీ, నరసింహారెడ్డి, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

మోదీ పర్యటనతో ప్రయోజనం శూన్యం


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాలుగు సార్లు వచ్చినా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతోపాటు కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యిందని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు అన్నారు. గురువారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక హోదా ఊసే ప్రధాని ఎత్తలేదంటే ఆంధ్రప్రదేశ్‌పై ఎంత ప్రేమ ఉందో ప్రజలు గమనించాలన్నారు. వెనుకబడిన జిల్లాలకు ఏటా రూ.50 కోట్ల చొప్పున నిధులు ఇస్తామని, కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని చెప్పి 12 ఏళ్ల క్రితం ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడం సిగ్గుచేటన్నారు. విభజన హామీల ప్రస్తావన సభలో పీఎం ఎందుకు ఎత్తలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హామీలు అమలు చేయాలని ప్రజల పక్షాన నిరసనలు తెలిపే నాయకులను అరెస్ట్ చేయించడం సబబు కాదన్నారు.

ప్రాణాలు పోతున్నా మారరా?

జూపాడుబంగ్లా: పక్షం రోజుల క్రితం ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల రోడ్డు ప్రమాదం జరిగి ఒకరు మృతిచెందగా 20 మంది గాయపడిన ఘటన మండలంలోని తంగడంచ చెక్‌పోస్టు సమీపంలో చోటుచేసుకుంది. అయినా ఆటో డ్రైవర్లు, వ్యవసాయ కూలీలు మారడం లేదనే విమర్శలున్నాయి. కడుపుతిప్పల కోసం వ్యవసాయ పనులకు వెళ్లే కూలీల నుంచి ఆటోడ్రైవర్లు రూ.50 నుంచి రూ.100 చార్జీ తీసుకుని పరిమితికి మించి ఎక్కించుకుని పొలాలకు తరలిస్తున్నారు. ఆరుగురిని కూర్చోబెట్టుకోవాల్సిన ఆటోలో 20 నుంచి 30 మంది దాకా వ్యవసాయ కూలీలను ఎక్కించుకుంటుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కనీసం పోలీసులైనా ఆటో డ్రైవర్లపై చర్యలు తీసుకుని, వ్యవసాయ కూలీలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.